# కార్ల్‌మార్క్స్ ద్విశతజయంతి సభ

**2019** మార్చి 14న, సిపిఐ(ఎం-ఎల్) ఒడిషా రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లోని లోహియా అకాడమీ హాల్‌లో కార్ల్‌మార్క్స్ ద్విశతజయంతి సంవత్సరాన్ని పురస్కరించుకొని 'ప్రస్తుత ప్రపంచంలో మార్క్సిజమే ఒకే ఒక్క ప్రత్యామ్నాయం' అనే అంశంపై సెమినార్ జరిగింది.

ఈ సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో మార్క్సిజం ప్రాధాన్యతను వివరిస్తూ, ఆ సిద్ధాంతం నాయకత్వంలో సాధించిన విజయాలను వివరిస్తూ విస్తృత ప్రచారం జరిగింది. ఉద్యమకార్యకర్తల, శ్రేయోభిలాషుల సమావేశాలను పార్టీ నిర్వహించింది. వీటి ముగింపుగా భువనేశ్వర్‌లో ఈ సెమినార్‌ను నిర్వహించింది. అనేకమంది వామపక్ష మేధావులు ప్రసంగించిన ఈ సెమినార్‌కు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ప్రతినిధులు హాజరయ్యారు.

పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయమే లేదని బూర్జువా ఆర్థికవేత్తలు సాగిస్తున్న ప్రచారాన్ని వక్తలు తీవ్రంగా ఖండించారు. వేతన జీవులు, శ్రామిక ప్రజల శ్రమశక్తిని కొల్లగొట్టిన, సూపర్ లాభాల వేటలో కార్మిక ప్రజలను అంతులేని కడగండ్లకు గురిచేసిన పెట్టుబడిదారీ విధానం ప్రజల ఏ ఒక్క మౌలిక సమస్యనూ పరిష్కరించలేదని వారు వక్కాణించారు. పెట్టు బడిదారీ విధానం తన అంతర్గత వైరుధ్యాలు, బలహీనతలు, సంక్షోభాలలో చిక్కుకుని, దాని నుండి బయట పడలేదని వివరించారు. పెట్టుబడిదారీ విధాన అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాదం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ మొత్తాన్ని పరిరక్షిస్తామని చెబుతోంది కానీ అది కూడా పీకల లోతు సంక్షోభంలో వుందన్నారు. ఈ సంక్షోభం, పెరుగుతోన్న వైరుధ్యాలు ప్రపంచంలో సామ్రాజ్యవాదుల మధ్య ప్రపంచాధిపత్యం కోసం పోటీని తీవ్రం చేసిన ఫలితంగానే రెండు విధ్వంసకర ప్రపంచ యుద్ధాలు సంభవించాయన్నారు. మొదటి ప్రపంచయుద్ధ కాలంలో రష్యా విప్లవం విజయవంతంకాగా, రెండవ ప్రపంచ యుద్ధం ఫాశిజాన్ని ఓడించటం ద్వారా సామ్రాజ్యవాదాన్ని బలహీనపరిచిందన్నారు. ఈ పరిస్థితులే నాటి ప్రపంచంలో యూరప్ దేశాలలో, చైనాలో ఇతర అనేక దేశాలలో విప్లవాలు విజయవంతం కావటానికి దోహదం చేశాయన్నారు. గత 70 సం॥లుగా సామ్రాజ్యవాదులు ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లతో సహా ఏ దేశాలలోనైతే సైనిక దాడులు, దురాక్రమణలకు పాల్పడ్డారో, ఆ ప్రాంతాలన్నింటినుండీ తీవ్రమైన ప్రతిఘటన నెదుర్కోరు అన్నారు. సామ్రాజ్యవాదం నేడు అతిపెద్ద విధ్వంసకుడిగా, దోపిడీదారుగా, శాంతికి అవరోధకునిగా, మానవ ప్రగతి నిరోధకునిగా నిలిచిందన్నారు.

మార్క్సిజానికి 200 సం॥ల లోపు చరిత్ర మాత్రమే వుంది. అయినా, సామాజిక గమనాన్ని ఈ సిద్ధాంతం మౌలికంగా మార్పులకు గురి చేసింది. ఇప్పటిదాకా తత్వవేత్తలు సమాజాన్ని పరిపరివిధాల నిర్వచించారు. ఒక దోపిడీ రూపం స్థానంలో మరో దోపిడీ రూపం రావటం గానే వారు చూడగలిగారు. కార్ల్‌మార్క్స్ గతితార్కిక, చారిత్రక భౌతికవాద దృష్టితో మానవ సమాజాభివృద్ధిని పరిశీలించి, శాస్త్రీయంగా నిర్వచించాడు. ఇప్పటిదాకా ఊహించని మరో సామాజిక వ్యవస్థను ప్రతిపాదించాడు. సామ్యవాదం, కమ్యూనిజం ద్వారానే మానవాళి ఎదుర్కొనే అన్నిరకాల దోపిడీ పీడన అణచివేత, అసమానతలకు చరమగీతం పాడవచ్చని సూత్రీ కరించాడు. ప్రపంచ కార్మికులారా, ఏకంకండి' - అని కమ్యూనిస్టు ప్రణాళిక ఇచ్చిన పిలుపు నేటికీ విలువైనది, విప్లవాత్మకమైనదిగా వుంది. మార్క్సిజం ప్రపంచంలో ఉనికిలోకి వచ్చిన తర్వాత, ఆ సిద్ధాంతం దోపిడీ పీడనల విముక్తికై కార్మికవర్గానికి, పీడిత ప్రజానీకానికి మార్గదర్శిగా నిలిచింది. భారతదేశంలో కూడా మార్క్సిజం మార్గ నిర్దేశనలో కమ్యూనిస్టులు అనేక మహత్తర పోరాటాలు తెలంగాణా సాయుధ పోరాటం వంటి రైతాంగ ఉద్యమాలు నిర్మించారు.

మార్క్సిజం ఆవిర్భావం నాటి నుండీ దానిపై బూర్జువావర్గాలు, దోపిడీదారులు దాడులు సాగిస్తూనే వున్నారు. సామ్యవాదం వెనుకపట్టు పట్టిన నేటి దశలో ఆ దాడుల తీవ్రత మరింత పెరిగింది. మార్క్సిజం మృతప్రాయ మైందిగా వారు ప్రచారం గావిస్తున్నారు. గందరగోళాలు కల్పిస్తున్నారు. మార్క్సిజం, సోషలిజం సిద్ధాంతాల, నమ్మకాలపట్ల అప విశ్వాసాలను పెంపొందిస్తూ, సన్నగిల్ల చేస్తున్నారు. అయితే మార్క్సిజం, సోషలిజం సాధించిన మహత్తర విజయాలను చరిత్ర పుటల నుండి, ప్రజల మనసుల నుండి వారు తొలగించలేరు. ఆకలి, పేదరికం, నివాసం, నిరక్షరాస్యత, అనారోగ్యం వంటి ఎన్నో ప్రజల మౌలిక సమస్యలను సోషలిజం శక్తివంతంగా పరిష్కరించింది. ప్రజలను, దోపిడీ అణచివేతల నుండి విముక్తి గావించింది. పెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్యవాదానికి, ఫాశిజానికి వ్యతిరేకంగా పోరాటంలో చైతన్యయుతంగా నిలిపింది. పీడిత జాతుల, ప్రజల పోరాటాలను అది ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చింది. మార్క్సిజం మాత్రమే వారి పోరాటాలను సరైన దిశలో గమ్యంవైపు నడపగలదు.

ఈ సెమినార్‌లో పాల్గొన్న వక్తలందరూ మార్క్సిజంపై జరుగుతున్న దాడులను సమర్ధ వంతంగా తిప్పికొట్టాలని, పిలుపునిచ్చారు. మార్క్సిజాన్ని సరిగా అధ్యయనం చేసి, నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి వర్గపోరాటాలను, విప్లవోద్యమాలను ముందుకు తీసుకువెళ్ళాలని పిలుపునిచ్చారు.

సిపిఐ(ఎం-ఎల్) ఒడిషా రాష్ట్ర కార్యదర్శి కా॥ శ్రీకాంత్ మొహంతి, రాష్ట్ర నాయకులు కా॥ బసుదేవ్ మరియు కా॥ గోలక్ బీహారీనాథ్ తదితరులు ప్రసంగించారు. సిపిఐ(ఎం-ఎల్) ఒడియా పత్రిక 'ఆగువాన్'ను సెమినార్ ముగింపులో ఆవిష్కరించారు.

oooo